

# జ్వాల

వేపపువ్వు, మామిడికాయలు, మల్లెమొగ్గలు, పరిమళాలు, సుందర స్వప్నాలు, సిగ్గు దొంతరలు... ఆకాశం జాలితలచి జారవిడిచిన వెన్నెల తునక రూపం దిద్దుకుని తన ముందుకు నడిచి వచ్చినట్లనిపించింది శ్రుతికి హసంతిని చూడగానే. హసంతి చేతిలో హార్లిక్స్ సీసానిండా ఉగాది పచ్చడి.

"ఆంటీ! అమ్మ యిచ్చి రమ్మంది."

"నాక్కావలసింది ఉగాది పచ్చడి కాదు" అర్థవంతంగా చూసింది శ్రుతి.

"మరేమిటి ఆంటీ?" అమాయకంగా అడిగింది హసంతి.

"నీ పెళ్ళి భోజనం" హసంతి చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. కళ్ళువాలిపోయాయి.

"అప్పుడే ఎక్కడాంటీ? మా బావ ఐ.ఎ.ఎస్. పరీక్షవాలి. తను తప్పకుండా సెలక్ట్ అవుతాడనుకోండి. కాని... తరువాత అదేదో ట్రైనింగ్ వుందట కదా. అదికూడా అయిపోవాలి" హసంతి పెదవులమీద చిరు హాసాలు. కనుపాపల్లో కలల దీపాలు.

"అప్పటిదాకా పెళ్ళి వద్దంటున్నాడు మా బావ" హసంతి కంఠంలో నిరాశ.

"ప్చ్! ఐతే యిప్పుడప్పుడే నీ పెళ్ళి భోజనం తినే అదృష్టం నాకు లేదన్న మాట!" తమాషాగా నిట్టూర్చింది శ్రుతి.

"భోజనం దేముంది ఆంటీ!..."

"అలా అనకు మరి. పెళ్ళి భోజనం. అదీ కలెక్టరుగారి పెళ్ళి భోజనమంటే... ఆ గ్రేస్. ఆ హోదా, ఆ గొప్పపేరు" శ్రుతి హాస్యం చేస్తుంటే గర్వంతో మెరుస్తున్నాయి హసంతికళ్ళు.

"మా బావ చాలా మంచాడు ఆంటీ! ఆ టెక్కులు, నిక్కులు అంటే చిరాకు. మనుషులంటే ప్రాణమిస్తాడు. ఈ సారొచ్చినప్పుడు బావని మీకు పరిచయం చేస్తాను. మీరే చూస్తారు తనెలాంటివాడో?" ఆనందంగా బావగుణాల్ని వర్ణించసాగింది హసంతి. బావంటే ఆ అమ్మాయికున్న అనురాగాన్నీ, అవధుల్ని మించిన ఆరాధననూ ముచ్చటగా గమనిస్తూంది శ్రుతి.

హసంతి ఆనందాన్ని హరించివేసి, ఆమె కలల్ని, కోరికల్ని చెల్లా చెదురుచేసే సంఘటన జరిగింది కొన్ని మాసాల తరువాత. ఆమె బావ తనతోటి ఐ.ఎ.ఎస్. ఆఫీసరొకామెను పెళ్ళాడాడు. మౌనంగా, పెదవి విప్పకుండా, రెప్ప వాల్చకుండా, నిశ్చలంగా, శూన్యంలోకి చూస్తూ కూర్చున్న హసంతి రూపం విభ్రాంతిని కలిగిస్తూంది. రాత్రింబవళ్ళు నిద్ర పోకుండా, చలనం లేకుండా కూర్చుంటున్న హసంతిని చూస్తే గుండె చెరువవుతుందామె తల్లిదండ్రులకు. ఆమెలో కదలిక నెలా తీసుకురావాలో, మామూలు లోకంలో కెలా తేవాలో పాలుపోక శ్రుతి సలహా అడిగారు.

బుజ్జగించి, నచ్చచెప్పి, ప్రతి ఆదివారం బలవంతాన ఎటో అటు తీసుకువెళ్ళి హసంతి మనసు మళ్ళించి మనుషుల్లో పడేలా చేసింది శ్రుతి.

"థాంక్ యూ డాక్టర్! మీరు మా అమ్మాయికి చేసిన మహోపకారాన్ని జన్మలో మరిచిపోలేం" కృతజ్ఞతతో ఒణికింది హసంతి తండ్రి స్వరం.

"నాదేముందండీ, టైమ్-టైమ్‌కి ఎంతటి లోతైన గాయాల్నీ మాన్పడానికి శక్తి వుంటుంది"

హసంతి హసిస్తూంది. నలుగురితో మాట్లాడుతూంది. అందుకెంతో పొంగిపోయిన ఆమె తల్లిదండ్రులు హసంతి అంటే మక్కువ చూపుతున్న శ్రీనివాస్‌కిచ్చి వైభవంగా ఆమె వివాహం జరిపించారు.

"ఏమ్మా? ఏమయింది? ఎందుకలా వున్నావు? రెండు మాసాల తరువాత విపరీతమైన మనఃక్లేశంతో తన దగ్గరి కొచ్చిన హసంతిని అడిగింది శ్రుతి.

"ఆంటీ! రోజురోజుకీ నాకు నేను అర్థం కాకుండా పోతున్నాను. కొన్నేళ్ళుగా నేను పెంచుకున్న కోరికల్నీ, కలల్నీ ఒక్కసారిగా మరిచిపోలేక పోతున్నాను. బావ ప్రాణంలో ప్రాణంలా బ్రతకాలని, బావ ప్రేమలో స్వర్గాన్ని చూడాలనీ, బావ భార్యగా అతని జీవితాన్నీ, హోదానీ, కీర్తినీ పంచుకోవాలనీ, ఎన్ని అందమైన ఊహలు!! ఎన్నెన్ని బంగారు స్వప్నాలు!! అన్నిటినీ ఒక్కక్షణంలో కూలదోసి వెళ్ళిపోయాడు బావ. బ్రతుకులో అన్నీ మనం కోరుకున్నట్లు జరుగవు... ఎన్నో ఎదురుదెబ్బలు తగుల్తుంటాయి. దెబ్బలు మాన్చుకుని నిలబడాలి. రెట్టింపు వేగంతో నడవాలని నాకు తెలుసు. కాని... అలా తెలుసుకోడానికీ ఆచరణలో పెట్టడానికీ ఎంత భేదముందో అనుభవమవుతూంది. ఆంటీ! శ్రీనివాస్‌ని హృదయ పూర్వకంగా ప్రేమిస్తూ, జరిగిపోయిన వాటిని మరిచిపోవాలని నా ప్రయత్నం' గద్గద కంఠంతో నెమ్మదిగా చెప్పుకుపోతూంది హసంతి.

"ఆంటీ! నా ప్రయత్నంలో నేనెంత ఘోరంగా ఓడిపోతున్నానో తెలుసా? శ్రీనివాస్ నా దగ్గరకు వస్తేచాలు. బావ నా కళ్ళముందు నిలుస్తాడు. శ్రీనివాస్ నన్ను ముట్టుకుంటే చాలు. నాకెంతో ప్రియమైన బావ స్పర్శ గుర్తుకొచ్చి శ్రీనివాస్ నుంచి దూరంగా జరిగేదాకా నాకు కంపరంగా వుంటోంది. ఒకవైపు అతనికి దగ్గర కాలేని అశక్తత, మరోవైపు అతనికి మానసికంగానూ, శరీరకంగానూ ఏ అందమైన అనుభూతినీ యివ్వలేకపోతున్నానన్న బాధ, నా మానసిక దౌర్బల్యాలతో, నిగ్రహించుకోలేని సెంటిమెంట్స్‌తో అతన్ని బాధించడం అమానుషం అన్న స్పృహ... చిత్రహింస ననుభవిస్తున్నాను ఆంటీ!... ఆంటీ...! నాకేమైనా మందివ్వండి. గతాన్ని పూర్తిగా మరిపించగల మందు, పూర్వపు జ్ఞాపకాల్నీ, అనుభవాల్నీ నా హృదయంలో నుండి తుడిచేయగల మందిచ్చి పుణ్యం కట్టుకోండి ఆంటీ!... నాకు బ్రతకాలనుంది. సుఖంగా బ్రతకాలనుంది. బ్రతుకును సంపూర్తిగా అనుభవించాలనుంది." ఉద్వేగ భరితమైన స్వరంతో చెప్తూంది హసంతి.